ట్రాఫిక్ చూడవయ్యా బాబూ

సత్యవేడు.. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం. పట్టణంలో రాకపోకలు వాహన చోదకుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. అసలే ఇరుకైన రోడ్లు..ఆపై ఇష్టానుసారంగా పార్కింగ్. భారీ లారీలు, టిప్పర్ల రాకపోకలతో ప్రతి రోజూ ట్రాఫిక్ స్తంభన పరిపాటిగా మారింది. ట్రాఫిక్ రద్దీ కారణంగా గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం, రాకపోకలకు ప్రజలు ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

- సత్యవేడు మీదుగా భారీ వాహనాల రాకపోకలు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- ఎన్నికల హామీ నెరవేర్చని సీఎం చంద్రబాబునాయుడు



సత్యవేడు మూడు రోడ్ల కూడలిలో స్తంభించిన ట్రాఫిక్

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ జఠిలమవుతోంది. నిత్యం రద్దీ నడుమ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో అవస్థలు తప్పడం లేదు. సత్యవేడులో 20వేలకు పైగా జనాభా ఉంది. దీనికి తోడు పట్టణానికి సమీపంలో ప్రముఖ పారిశ్రామికవాడ శ్రీసిటీ ఉండడంతో పట్టణ జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు మండలంలోని 28 పంచాయతీల నుంచి రోజూ విద్యార్థులు డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు, డ్వాక్రా మహిళలు బ్యాంకు పనులకు, వెలుగు కార్యాలయానికి, వ్యాపారులు, రైతులు మార్కెట్, రెవెన్యూ , వ్యవసాయ కార్యాలయాలకు వైద్యశాలలకు వచ్చిపోతుంటారు. ఈ కారణంగా రోజూ గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు రద్దీగా ఉంటోంది.

శ్రీసిటీ ఏర్పాటుతో పెరిగిన వాహనాల రాకపోకలు

సత్యవేడు సమీపంలో ఏర్పాటైన శ్రీసిటీలో 260కు పైగా కంపెనీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం కంపెనీలకు అవసరమైన ముడి సరుకులు, కంపెనీల ఉత్పత్తులు తరలించడానికి రోజూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆంధ్ర–తమిళనాడు సరిహద్దులోని తడ మండలంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఉండడంతో అక్రమంగా సరుకు రవాణా చేసే వాహనాలు సత్యవేడు మీదుగా చెన్నై, బెంగుళూరుకు వెళుతుంటాయి దీంతో శబ్ద, వాయు కాలుష్యం పెరిగిపోతోంది. అంతేకాకుండా రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడం, రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు ఆక్రమణలకు గురి కావడం, రోడ్డుపైనే పార్కింగ్ ద్విచక్రవాహనాల పార్కింగ్ మూలాన చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. సిబ్బంది కొరతతో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కత్తిమీద సాములా మారింది.

క్వారీ లారీలతో ఇబ్బందులు

మండలంలో పీవీపురం పంచాయతీలోని క్వారీల నుంచి నిత్యం చెన్నై, ఇతర ప్రాంతాలకు సత్యవేడు మీదుగా కంకర, మన్ను లోడ్లతో టిప్పర్లు సత్యవేడు మీదుగా వెళుతున్నాయి. వేగంగా వెళ్తున్న టిప్పర్ల మూలాన రోడ్ల పక్కన దుకాణాలు దుమ్ముమయం అవుతున్నాయి.

సీఎం నెరవేర్చని హామీ

ఎన్నికల ప్రచారంలో సత్యవేడుకు వచ్చిన చంద్రబాబు కోమటిగుంట సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి సత్యవేడు మూడురోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహం వద్దకు వచ్చేందుకు ట్రాఫిక్ సమస్యను అనుభవపూర్వకంగా ఆయన ఎదుర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న ఆయన సత్యవేడుకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఆ హామీకి అతీగతీ లేదు.

బైపాస్‌తోనే ట్రాఫిక్ కష్టాలు దూరం



సత్యవేడులో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి సత్యవేడుకు బైపాస్ రోడ్డు వేస్తేనే సత్యవేడు ప్రజలకు కష్టాలు అవస్థలు తప్పుతాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–బందారు మోహన్‌బాబు, మాజీ ఎంపీటీసీ, సత్యవేడు

తీవ్ర ఇబ్బందులు



పట్టణం మధ్య నుంచి భారీ వాహనాలు వెళుతుండడంతో గాంధీ రోడ్డు మలుపు వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. విద్యార్థులు ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలకు పార్కింగ్ స్థలం చూపాలి. టిప్పర్లు మితిమీరిన వేగంతో వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

–కల్లూరి ప్రసాద్, నరసరాజు అగ్రహారం

క్లుప్తంగా

పోలేరమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే

తొట్టంబేడు: మండలంలోని చోడవరం గ్రామంలోని పోలేరమ్మ జాతర సందర్భంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్వామీజీకి వైశ్యుల సన్మానం



శ్రీకాళహస్తి: వైశ్యుల కుల గురువు పూజ్య శ్రీశ్రీ వామనాశ్రమ మహాస్వామీజీ (కర్ణాటక)ని బుధవారం వైశ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ఆయన స్థానిక బజారు వీధిలోని శ్రీ ఓరుగంటి చెంగయ్య శెట్టి సత్రంలో భక్తులతో అనుగ్రహభాషణం చేశారు. అలాగే వాసవి ఆలయం దసరా ఉత్సవాల కరపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం స్వామీజీని సన్మానించారు.

నేడు ఆలయ దుకాణాల వేలం

నాగలాపురం: సురుటుపల్లిలోని సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర దేవస్థానంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ దుకాణాలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లత తెలిపారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన

నారాయణవనం: స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప వైద్యకేంద్రాల్లో మహిళల కోసం బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరంలో మహిళలకు వైద్యపరీక్షలను నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్ రాజ్, పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డాక్టర్ వేణయ్య, సీహెచ్‌ఓ హరినాథయ్య పాల్గొన్నారు.

శివయ్య సేవలో చీఫ్ పాస్‌పోర్టు ఆఫీసర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ, చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ కేజే శ్రీనివాస్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి రాహు కేతు పూజల ఏర్పాటు చేశారు.

బ్యాడ్మింటన్ విజేత నాగలాపురం



విన్నర్స్, రన్నర్స్ జట్లు

నాగలాపురం: బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. నాగలాపురం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విశ్వభారతి విద్యానికేతన్ స్కూల్ జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయని పీఈటీ ఎస్.బాబు తెలిపారు. టీచర్లు సురేంద్ర, దొరబాబు, ముని కృష్ణారెడ్డి, సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

సంత వ్యాపారం వర్షార్పణం



నాగలాపురం: స్థానిక ధర్మరాజుల గుడివీధిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో సంతలో చిరు వ్యాపారస్తులు, కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. వారపు సంత ప్రాంతమంతా వర్షపు నీటితో బురదమయమైంది. సరుకులు తడిసిపోవడంతో వ్యాపారులు లబోదిబోమన్నారు. అలాగే కూరగాయలు సైతం అమ్ముడు పోక రైతన్నలు విషాదవదనాలతో వెనుదిరిగారు.

అట్టహాసంగా యాత్రి సేవా దివస్



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రేణిగుంట: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో నిర్వహిస్తున్న రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం యాత్రి సేవా దివస్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రయాణికులకు తిలకం పెట్టి స్వాగతించడం, సాంప్రదాయ ఆతిథ్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్వీ సంగీ కళాశాల విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విమానాశ్రయం ఆవరణలో సీనియర్ సిటిజన్లు మొక్కలు నాటారు. 114 మంది ప్రయాణికులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 46 మంది డ్రైవర్లు ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. రక్తదాన శిబిరంలో దాతలనుంచి 48 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. విమానాశ్రయం డైరెక్టర్ భూమినాథన్, అధికారులు పాల్గొన్నారు.

ఏకాదశి ఉత్సవంలో కల్యాణ వెంకన్న



నారాయణవనం: ఏకాదశిని పురస్కరించుకుని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి, మాడ వీధుల్లో విహరించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు కౌసిక్ భట్టాచార్య, బాలాజీ భట్టాచార్య పర్యవేక్షించారు.

ఉచిత విద్యుత్ అమలు చేయండి



ఆందోళన చేస్తున్న చేనేత సంఘం నేతలు

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్లు, పవన్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం ఏమిటని చేనేత కార్మికులు ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. ఆ మేరకు వరదయ్యపాళెంలో బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. అనంతరం వినతిపత్రాలను అందజేశారు. చేనేత కార్మిక సంఘం నాయకులు పృథ్వీ రవి, బుర్రా కృష్ణమూర్తి, సిద్ధలయ్య పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ గురుమూర్తితో భేటీ





మాజీ మంత్రి పెద్దిరెడ్డిని, తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసిన పిచ్చాటూరు మండల నేతలు

నాగలాపురం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తిని పిచ్చాటూరు మండల నేతలు సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి బుధవారం తిరుపతిలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కె.టి.హరిశ్చంద్రా రెడ్డిని నియమించడంపై వారు పెద్దిరెడ్డికి, ఎంపీ గురుమూర్తికి శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు పెద్దిరెడ్డికి, ఎంపీ గురుమూర్తికి రుణపడి ఉంటానన్నారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తా అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రోసిరెడ్డి, నాయకులు భూపతి, సురేష్, సతీష్, గోవిందన్, విఘ్నేష్, మనో, బాలాజీ, వసంత్, ఆర్‌ఎస్ రాజు, మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



రేణిగుంటలో..

శ్రీకాళహస్తి: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని కరిమారియమ్మ ఆలయం వద్ద బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఎస్.సుకుమార్, సి.మునికుమార్ ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. విశ్వకర్మ బ్రహ్మ మానస పుత్రుడు అని, ఈ విశ్వానికి మూలాధారమైన చేతివృత్తుల వారికి అభయమిచ్చే, ఆశ్రయమిచ్చే దేవుడని అన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, గురవయ్య, నాగరాజు, మురళి, దొరబాబు, లక్ష్మయ్య, భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భగవాన్ విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ రవిచంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప, జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్, విద్యాసాగర్, ఎంజీ.రెడ్డి, వీఆర్.రావణ, శివ, సుధాచారి తదితరులు పాల్గొన్నారు.





హిమతనయ, సుశీలమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

మాజీ ఎమ్మెల్యే నివాళి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన హోంగార్డు కూరపాటి గోవిందరాజు సతీమణి కూరపాటి హిమతనయ హఠాన్మరణం చెందారు. అలాగే, గణపతి కాలనీ లో నివసిస్తున్న రాధా అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం వారి మృతదేహానికి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పంగురుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోవర్ధన్‌రెడ్డి తల్లి తులసమ్మ కర్మక్రియలకు బుధవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే శ్రీకాళహస్తి మండలంలోని పోలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలి మల్లికార్జుననాయుడు సతీమణి సుశీలమ్మ మృతిచెందడంతో ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, గస్తీ బలోపేతం చేసి అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, గదులు, జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండరు..ఇత్యాది రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ పరిహారం చెల్లింపునకు గ్రామసభ



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామంలో ఏపీఐఐసీ భూములకు చెల్లించవలసిన భూనష్టపరిహారం కోసం బుధవారం తహసీల్దారు శ్రీదేవి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తపాళెం గ్రామంలో ఏపీఐఐసీ కోసం భూములను సేకరించడం జరిగిందన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులకు భూ నష్ట పరిహారం చెల్లించామని తెలిపారు. పట్టాదారులు, భూవివాదాలు వంటి కారణాల వల్ల 50 మంది రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా పెండింగ్‌లో ఉందన్నారు. గ్రామసభలో వీరిని విచారించి, రికార్డులను పరిశీలించి త్వరలోనే నష్టపరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా, చెస్‌లతో ఏకాగ్రత



యోగా, చెస్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



చదరంగ క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రూపాదేవి

శ్రీకాళహస్తి: యోగా, చెస్‌లతో మానసిక ఏకాగ్రత సాధ్యమవుతుందని ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. అండర్–14, 17 విభాగాలు కింద నిర్వహించిన పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కిషోర్, మండల కోఆర్డినేటర్ జేమ్స్, ఎంఈఓ–2 బాలయ్య, హెచ్ఎం తీగల వెంకటయ్య, పీడీలు రమణ, వెంకటముని, ఇందిర పాల్గొన్నారు.

అభినందన..

స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో బుధవారం మండల స్థాయి చదరంగం పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయం సాధించినట్టు ఆ స్కూల్ ప్రిన్సిపల్ రూపాదేవి తెలిపారు. అండర్–17 విభాగంలో పరమేశ్వర్, విశ్వతేజ్ రెండవ బహుమతి, అండర్–14 విభాగంలో పూర్విత 4వ బహుమతిని సొంతం చేసుకుని ముగ్గురూ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. డీన్ త్రివేణి, ఇన్‌చార్జ్‌లు కల్పన, శ్రీహరి, పీఈటీ మేఘన పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



నారాయణవనం: రక్తదానం ప్రాణదానంతో సమానమని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోకరాజు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 111 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం ఆడిటోరియంలో కేక్‌ను కట్ చేశారు. స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మోదీ పేరున ప్రత్యేక అర్చనలను అశోకరాజు నిర్వహించారు.

రైల్వే స్టేషన్‌లో 'స్వచ్ఛ భారత్'

రేణిగుంట: దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో బుధవారం నుంచి స్వచ్ఛతా హీ సేవా 2025, స్వచ్ఛ్ ఉత్సవ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రేణిగుంట రైల్వే స్టేషన్‌లో సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ శేషగిరినాథరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రైల్వే స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు







చిన్న పాండూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రశాంత్, సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, శ్రీకాళహస్తి: అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం: ఆరోగ్యవంతులైన మహిళలతోనే బలమైన కుటుంబం సాధ్యమని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో, కాంబాకం సచివాలయం వద్ద రెండుచోట్ల వేర్వేరుగా మహిళల ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలను నిర్వహించారు.వైద్యాధికారి ప్రశాంత్, సర్పంచులు దీప, శ్యామల, నేతలు భాస్కర్‌రెడ్డి, భరణి బాస్, ఎంపీహెచ్‌ఓ రవీంద్రుడు, హెల్త్ సూపర్‌వైజర్ పవనకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: అసంక్రమిత వ్యాధులకు సంబంధించి మహిళలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై ఆయన వైద్య సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, అక్టోబరు 2వ తేదీ వరకు మహిళలకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం కింద రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధులను స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో నిర్దేశిత తేదీలలో స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తామని, దీనిని ఆయా ప్రాంతాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశులు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడు: మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నాగలాపురంలో..

నాగలాపురం: స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్1 వరకు అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తారని వైద్యాధికారి విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని మహిళలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక శ్రీరామ నగర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించారు. గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. పోషకార పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. మహిళల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం, అవగాహనా కార్యక్రమాలు నెలపాటు నిర్వహించనున్నట్టు సీడీపీఓ శాంతిదుర్గ, మెడికలాఫీసర్ బాలు తెలిపారు. మండలంలోని గ్రామాలు, వార్డుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. భువనేశ్వరి, వార్డు సూపర్‌వైజర్ హరిత, మంజుల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ–శక్తిమంతమైన కుటుంబం) కార్యక్రమం ద్వారా మహిళలకు మెరుగైన వైద్యసేవలను అందించనున్నట్లు ఏర్పేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్.బి.శివప్రియ, డాక్టర్ పి. లావణ్య తెలిపారు. స్థానిక పీహెచ్‌లో స్వస్థ్ నారీ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య హాజరయ్యారు. మహిళలకు మెరుగైన ఆరోగ్యంపై అవగాహన పెంచడం, పోషకాహార ఆవశ్యకత, తల్లీబిడ్డల ఆరోగ్యం ప్రధాన లక్ష్యంగా వైద్యబృందాలు అవగాహన కల్పిస్తాయన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు గౌరమ్మ, సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంట్ తులసి పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: దేశవ్యాప్తంగా స్వస్థ్ నారీ..సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణిగుంటలో సర్పంచ్ నగేషం చేతుల మీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తొలిరోజు మండల పరిషత్ కార్యాలయం, తారకరామానగర్‌లో శిబిరాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ తేజస్విని, డాక్టర్ జుబేర్ అహ్మద్ మాట్లాడారు. రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు నాగరాజు, కామరాజు, అనూరాధ, సుమశ్రీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇస్తే.. దోచేశారు!

శ్రీకాళహస్తి: ఓ యువకుడిని బెదిరించి రూ.30 వేలను ఆగంతకులు దోచుకున్న ఘటన శ్రీకాళహస్తిలో వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ..ఉత్తరప్రదేశ్‌కు చెందిన విమలేంద్ర యాదవ్ శ్రీకాళహస్తి–చెన్నై రోడ్డులోని ఓ హోటల్లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతను బీపీ అగ్రహారంలో అద్దె ఇంట ఉంటున్నాడు. మంగళవారం జీతం పొందిన యువకుడు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా పరిచయం లేని ఓ బాలుడు అరవకుత్తూరు రోడ్డులో వదిలి పెట్టాలని సాయం కోరాడు. అతడిని ఎక్కించుకుని వెళ్తుండగా స్కిట్ కళాశాల సమీపంలో ఆగంతకుల బారి పడ్డాడు. లిఫ్ట్ ఇచ్చిన బాలుడితోపాటు మరో ఇద్దరు యువకులు కలిసి అతడిని బెదిరించి నగదును లాక్కుని ఉడాయించారు. ఇదంతా ప్లాన్ ప్రకారమే చేసినట్టు తెలుస్తోంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.